ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (విశాఖపట్నంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 27-11-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు అనేక తలంపులు వస్తున్నాయి. అందులో మొదటి తలంపు, ప్రధాన తలంపు నేను. గాఢనిద్రలో నేనుఅనే తలంపు లేదు. జాగ్రదావస్థలోనికి రాగానే మనకు తెలియకుండానే మొదట నేనుఅనే తలంపు హృదయంలోనుండి శిరస్సులోనికి వస్తుంది. తరువాత అది దేహముతోటి, లోకంతోటి, విషయాలతోటి తాదాప్యం చెందుతుంది. నేనుఅనే తలంపు రాకముందు మనకు ఏమీ తెలియదు. నేనుఅనే తలంపు ఎక్కడనుండి వస్తోందో చూడు అది ఉదయించినచోటు నీవు చూడగలిగితే నీమనస్సు అక్కడ లయిస్తుంది. అప్పుడు నీవు ఎవడో నీకు తెలుస్తుంది. మనోమూలంలోనే చైతన్యం ఉంది. నీమనస్సుయొక్క మూలంలోనికి ఎప్పుడైతే వెళ్ళావో చైతన్యం నీకు అనుభవంలోనికి వస్తుంది. చైతన్యానికి చావుపుట్టుకలతోటి, కర్మలతోటి, కర్మఫలాలతోటి ఏమీ సంబంధంలేదు. అది స్వతంత్రమైనది. చైతన్యము నీకు అనుభవంలోనికి వచ్చినపుడు దుఃఖంలేని స్థితికి ఎదిగి వెళతావు. అప్పుడు నీ హృదయంలోఉన్న పరమేశ్వరుడే నీకు నిజమైన నేనుగా వ్యక్తమవుతాడు. భగవంతుడు ఉన్నాడో, లేడో నీకు తెలియదు. నేను ఉన్నానన్నసంగతి నీకు తెలుస్తోంది. ఆనేను ఎవడో నీకు తెలిస్తే ఆదేహగతమైన నేను ఎవడో నీకు తెలిస్తే దేవుడు నీకు తెలుస్తాడు.

గాఢనిద్రలో మనం సుఖంగా ఉన్నాము, శాంతిగా ఉన్నాము. కాని ఉన్నామన్న సంగతి మనకు తెలియటంలేదు. జాగ్రదావస్థలో మనం ఉన్నట్లు మనకు తెలుస్తోంది. కాని సుఖంగా లేము, శాంతిగా లేము. జాగ్రదావస్థలో ఉన్న ఎరుక, గాఢనిద్రలో ఉన్న సుఖం, శాంతి ఒకేసారి మనకు అనుభవంలోనికి వస్తే అదే మోక్షం. అజ్ఞానంఅంటూ ప్రత్యేకంగా ఏమీలేదు. మనం ఎవరిమో మనకు తెలియకపోవటమే అజ్ఞానం, మనం ఎవరిమో మనకు తెలిస్తే జ్ఞానం. మనం ఎవరిమో మనకు తెలియకపోతే అశాంతి, మనం ఎవరిమో మనకు తెలిస్తే శాంతి. మనం ఎవరమో మనకు తెలియకపోవటంవలన మనకు రాగద్వేషములు, కామక్రోధములు వస్తున్నాయి. రాగద్వేషములవలన కర్మ చేస్తున్నాము. ఎప్పుడైతే కర్మచేసామో అప్పుడు దేహం వస్తుంది. ఎప్పుడైతే దేహం వచ్చిందో దానితో దుఃఖం వస్తుంది. దేహంవస్తే దుఃఖం వస్తుంది. దేహం ఎందుకు వచ్చిందిఅంటే కర్మనుబట్టి వస్తుంది. కర్మ ఎందుకు చేస్తున్నాముఅంటే రాగద్వేషములవలన చేస్తున్నాము. రాగద్వేషములు ఎందుకు వస్తున్నాయిఅంటే అజ్ఞానంవలన వస్తున్నాయి. మనం ఎవరిమో మనకు తెలియకపోవటంవలన అజ్ఞానం వచ్చింది.

నీహృదయంలోఉన్న నిజానికి రాగద్వేషములకు ఎట్టి సంబంధం లేదు. రాగద్వేషములు నేనుఅనే తలంపును అంటిపెట్టుకొని ఉన్నాయి. నానిజస్థితిలో నేనులేనపుడు, నేనెవరో నాకు తెలియనపుడు భయం, అసూయ, కోపం, రాగం, ద్వేషం ఇవిఅన్నీ వెంటాడుతాయి. నానిజస్థితినుండి నేను జారిపోయినపుడు, నాస్వరూపంనుండి పతనమయినపుడు దేహగతమైన నేనుతో కలిసిపోయినపుడు ఈ రుగ్మతలు అన్నీ వస్తాయి. నా నిజస్థితిలోనేను ఉంటే ఈగొడవలు ఏమీలేవు. అవ్యక్తంలోనుండి నేనుఅనే తలంపు వస్తోంది. నేనుఅనే తలంపువచ్చాక ఇతర తలంపులు వస్తున్నాయి. దేవుని గొడవ వస్తోంది, పునర్జన్మల గొడవలు వస్తున్నాయి. నేను రాకముందు ఏగొడవా లేదు. అన్నింటికి మూలం నేనుఅనే తలంపు. నేనుఉంటే అంతాఉంది. నేను లేకపోతే ఏదీలేదు

అనేవారు భగవాన్. నేనువచ్చాక నాది వస్తుంది. నేను రాకపోతే నాది లేదు. ఈనేను ఎక్కడయితే అణిగిపోయిందో అక్కడ నిజమైన నేను నీకు వ్యక్తమవుతుంది. ఆనేనుకు పరిమితులు లేవు. అది నీకు వ్యక్తమయినపుడు అందులోఉన్న సుఖం, శాంతి, ఆనందము వచ్చి నీ సహస్రారమును ముంచివేస్తాయి.

దేవుడు ఉన్నాడా, లేడా అని భగవాన్‌ను అడిగితే దేవుడు ఉన్నాడుఅని చెప్పలేదు, లేడుఅని చెప్పలేదు. నీవు ఉన్నావాఅని అడిగారు. నేనుఉన్నాను అని అడిగినవాడు చెప్పాడు. నీవుఉంటే దేవుడు ఉన్నాడు అనిచెప్పారు. నేనుఅనే తలంపుఉంటే దేవుడు ఉన్నాడు. ఈనేను ఎంత నిజమో ఆదేవుడుకూడా అంతేనిజంఅని చెప్పారు. దేహం మరణించేవరకూ మోక్షంకోసం ఆగనక్కరలేదు. దేహం ఉండటం, దేహం మరణించటంతో మోక్షానికి ఎట్టిసంబంధంలేదు. తపస్సులుచేసి, పూజలుచేసి, ధ్యానాలుచేసి నీవు దేనినైతే పొందుదామని అనుకొంటున్నావో అది ఇప్పుడే ఉంది, ఇక్కడే ఉంది. దానిని ఇప్పుడే నీవు పొందవచ్చు. మరణంవరకు ఆగవలసిన పనిలేదు. అది నీహృదయంలోనే ఉంది. నీమనస్సును కొంత అంతర్ముఖం చేస్తే ఆవస్తువు నీకు అందుతుంది. మానవుడికి కావలసినది దేవుడుకాదు. మానవుడికి సుఖం, శాంతి, ఆనందం కావాలి. సైన్స్ దేహానికి కంఫర్టు ఇస్తుంది. ఫిలాసఫీ మనస్సుకు కంట్రోలు ఇస్తుంది. మనస్సుకు కంట్రోలు, దేహానికి కంఫర్ట్ రెండూ అవసరమే. కంట్రోలులేని మనిషికి ఎన్ని కంఫర్ట్సు ఉన్నా వాడు సుఖపడలేడు. కేవలం కంఫర్టువలననే ఆనందం రాదు. కంట్రోలుకూడా అవసరము. నేను ఎవడను? అనే ప్రశ్నకూడా మనస్సును కంట్రోలు చేయటానికే. దీనివలన మనస్సు నిగ్రహించబడుతుంది. ఎప్పుడైతే మనస్సుకు ఏకాగ్రత వచ్చిందో, పవిత్రత వచ్చిందో అప్పుడు దానికి అంతర్దృష్టి కలుగుతుంది. మనస్సు అంతర్ముఖం అయినపుడు హృదయంయొక్క లోయలలోఉన్న ఆనందం దానికి అందుతుంది.

నీవు భక్తిమార్గంలో ప్రయాణంచేసినా, కర్మమార్గంలో ప్రయాణంచేసినా, ధ్యానమార్గంలో ప్రయాణంచేసినా ఏమార్గంలో ప్రయాణంచేసినా నీవు మిథ్యానేనును పోగొట్టుకోవాలి. ఏనేనుఅయితే నిన్ను బంధిస్తోందో ఆనేనును నీవు తొలగించుకోవాలి. సమాజంలో, మన ఇంటిలో మనం జీవించే జీవితం అంతాకూడా ఆర్టిఫిషియల్ లైఫ్. ఈ ఆర్టిఫిషియల్ లైఫ్‌కు అలవాటుపడినవాడు ఆర్టిఫిషియల్ నేనును పోగొట్టుకోలేడు. ఈ ఆర్టిఫిషియల్ లైఫ్‌లోనుండి బయటపడటానికి ఎవడైతే సాధనచేయడో వాడు ఆర్టిఫిషియల్ నేనులోనుండికూడా బయటపడలేడు. మనకు నిజంతెలిసేవరకూ నిజంకానిదానిని నిజం అనుకొంటాము. ఈమిథ్యానేనులోనుండి, దేహగతమైన నేనులోనుండి విడుదల పొందితేనేగాని నీహృదయంలో ఉన్న సత్యం తెలియదు. ఇక్కడ అనేక రూపాలు కనిపిస్తున్నాయి. ఈరూపాలే, నామాలే అన్ని సంకటాలకు కారణం. రూపచింతన, నామచింతనవలన అహంకారం పెరుగుతుంది. రూపదృష్టి, నామదృష్టి లేకుండా ఎవడైతే పనిచేస్తున్నాడో ఆపనిద్వారా వాడు పవిత్రుడు అవుతాడు. పవిత్రతవలన, ఏకాగ్రతవలన అంతర్దృష్టి కలుగుతుంది. జీవుడికి పవిత్రత ఉంటే వాడు హృదయంలో లయమవుతాడు. పవిత్రత లేకపోతే, వినయం లేకపోతే, ఏకాగ్రత లేకపోతే వాడిని హృదయంలోనికి పంపలేము.

మనందరకు రూపాలు ఉన్నాయి. అందరి హృదయాలలో సత్యంఉంది. అది అరూపంగా ఉంది. అరూపంగా ఉన్న సత్యవస్తువు, నిజస్థితి నీ మాటలకు, ఊహలకు, ఆలోచనలకు అందకపోయినా నీ అనుభవానికి అందుతుంది. వేదాలలో, ఉపనిషత్‌లలో చెప్పబడిన వస్తువు ఉంది కాబట్టి రామకృష్ణుడికి, రమణుడికి, బుద్ధుడికి ఇలా అనేకమంది మహాత్ములకు అనుభవంలోనికి వచ్చింది. అసలు వస్తువే లేకపోతే ఎవరికీ అనుభవంలోనికివచ్చే అవకాశంలేదు. ఆవస్తువును అనుభవించి జీవించేవాడిద్వారా ఆవస్తువుయొక్క వైభవం మనకి తెలుస్తుంది. వ్యక్తిభావన లేకుండా మనంజీవిస్తే భగవంతుడు ఆయన స్వరూపాన్ని ఇస్తాడు.

మనందరికీ భగవంతుడిని తెలుసుకోవాలని ఉందికాని మనకు ఆయన తెలియబడడు. ఆయన ఎవరికి తెలియబడాలి అనుకొన్నాడో వారికి మాత్రమే తెలియబడతాడు అందరికి తెలియబడడు. ఇప్పుడు మనం

ఉన్నస్థితి సహజమైనస్థితికాదు. నిజంగా మనం సహజమైనస్థితిలో ఉంటే మనం ఆనందంగానే ఉంటాము. ఇప్పుడు మనం ఆనందంగా ఉన్నామా? ఆనందంగా లేము, శాంతిగా లేము. మనలో శాంతిలేదు లోకంలో శాంతికోసం ప్రయత్నం చేయటం. నాలో ఏదైనా ఉంటే అది మీకు ఇవ్వగలనుగాని నాలో ఏమీలేనపుడు మీకు ఏమి ఇవ్వగలను. ముందు మీరు శాంతిని పొందితే మీనుండి లోకంలోనికి శాంతి తరంగాలు వ్యాపిస్తాయి. ముందు మనం బాగుపడితే అదిచూసి ఇతరులు బాగుపడతారు. మనం చైతన్యస్థాయిని పెంచుకొంటే అదిచూసి ఇతరులకుకూడా చైతన్యస్థాయిని పెంచుకోవాలి అనేకోరిక, ఉత్సాహం కలుగుతుంది. ముందుమనం బాగుపడటానికి ప్రయత్నంచేయాలి.

మనస్సు వేగంగా బయటకు విజృంభిస్తుందిగాని లోపలకు వెళ్ళమంటే అంత తేలికగా వెళ్ళదు. సాధారణంగా ఎవరైనా కొంచం ఆస్తి సంపాదించుకొన్నారుఅనుకోండి మీరు పైకివెళ్ళారు అంటాము. MLA మంత్రి అయ్యాడు అనుకోండి మీరు పైకి వెళ్ళారు అంటాము. అలాగే రమణమహర్షిగారితో ఒకభక్తుడు మీరుచాలా పైకి వెళ్ళారు అనిఅన్నాడు. అప్పుడు భగవాన్ నేను పైకి వెళ్ళలేదు, లోపలకు వెళ్ళాను అన్నారు. పైకి వెళితే నిజం తెలియదు. నిజం పైనలేదు మన హృదయంలో ఉంది. హృదయంయొక్క లోతులలోనికి వెళితేగాని నిజం నీకు తెలియదు. ఎవడికైతే దేహబుద్ధి నశించిందో వాడికి హృదయంలోఉన్న వస్తువు నేనుగా వ్యక్తమవుతుంది. హృదయంలో ఉన్న సత్యవస్తువు, భగవంతుడు, ఆనందం మనకు అనుభవంలోనికి వచ్చినపుడు సిద్ధాంతాలతోగాని, చెప్పుడు మాటలతోగాని పనిలేదు. వాటిమీద ఆధారపడిఉండనక్కరలేదు. ఇప్పుడు నీదేహం ఎంత స్పష్టంగా నీకు తెలుస్తోందో అంత స్పష్టంగా నీహృదయంలో ఉన్న వస్తువు నీకు తెలుస్తుంది. నీ హృదయంలో మరణం లేనివస్తువు ఉంది. ఆ మరణం లేనివస్తువు నీకు అనుభవంలోనికి వచ్చినపుడు దేహం మరణించిన తరువాతకూడా నీవు ఉంటావు అని నీకు తెలుస్తుంది. దేహం మరణించిన తరువాతకూడా ఉంటానుఅని నీకు తెలిస్తే మరణం అంటే భయం ఉండదు. అప్పుడు వాడికి దేహంఉన్నా, లేకపోయినా ఒక్కటే. బ్రహ్మానుభవం కలిగినవాడికి దేహం ఎలాగ ఉంటుందో భగవాన్ చెప్పారు. మనం రైల్వేస్టేషన్‌లో దిగాముఅనుకోండి. మన పెట్టెలను కూలివాడి నెత్తిమీద పెడతాము. డబ్బుకోసం వాడు ఆపెట్టెలను మోస్తాడుగాని ఆపెట్టెలను నెత్తిమీద ఉంచుకుందామని వాడు అనుకోడు. గమ్యం ఎప్పుడు వస్తుందా దింపివేద్దాముఅని చూస్తాడు. బ్రహ్మానుభవం కలిగినవాడికి దేహంకూడా అంతే. దేహం ఉండటంవలన అతనికి లాభంఏమీ లేదు. పైగా దానికి చాకిరి చేయాలి.

నీహృదయంలో ఉన్న సత్యం ఎంత సింపుల్‌గా ఉందో నీవుకూడా అంత సింపుల్‌గా ఉంటే, అది ఎంత పవిత్రంగా ఉందో నీవుకూడా అంతపవిత్రంగా జీవిస్తే నదులువెళ్ళి సముద్రంలో కలిసినట్లు నీమనస్సువెళ్ళి హృదయంలో లయమవుతుంది. సహనం లేకుండా మనస్సుకు బరువు రాదు. అల్పబుద్ధి ఉన్నవారికి, స్వల్పబుద్ధి ఉన్నవారికి సత్యం తెలియబడదు. అల్పబుద్ధిలోనుండి విడుదలపొందినవాడికి వాడిహృదయంలో ఉన్న నిజం తెలుస్తుంది. సత్యాన్ని నీవు ప్రాక్టీసు చేస్తే తప్పనిసరిగా సత్యం నీకు తెలియబడుతుంది. నీవు ఏదైతే పొందాలిఅనుకొంటున్నావో అది నీవై ఉన్నావు. కాని అది ఎక్కడో దూరాన ఉంది అనుకొంటున్నావు. దేహగతమైన నేను ఎక్కడయితే నశిస్తుందో అక్కడ అది ఉంది. నీవు పూజలు చేస్తున్నావు, జపాలు చేస్తున్నావు, ధ్యానాలు చేస్తున్నావు. ఇవిచేసినా, చేయకపోయినా నీహృదయంలో నిజం ఉంది. నీ హృదయంలో ఉన్న నిజానికి నీవుచేసే పూజలు, జపాలు, ధ్యానాలకు ఏమీ సంబంధం లేదు. కాని పూజచేయటం, జపం చేయటం, ధ్యానం చేయటం ఎందుకంటే ఇవి చేయటంద్వారా నీ మనస్సు పవిత్రం అవుతుంది. విచారణ చేయటంవలన నీ హృదయంయొక్క లోతులు పెరుగుతాయి. నీ హృదయంలోఉన్న వస్తువును తెలుసుకోవటానికి ఇవిఅన్నీ సహకరిస్తాయి.

తల్లిలేకుండా బిడ్డరాదు అలాగే భక్తి లేకుండా జ్ఞానం రాదుఅని చెప్పారు భగవాన్. అద్వైతస్థితి పొందటానికి ద్వైతం మనకు ఎంతోకొంత సహకరిస్తుంది. భగవంతుని తెలుసుకొనేవరకూ భగవంతుడు వేరు, మనం వేరు అనుకొంటాము. ఉన్నది భగవంతుడే మనం లేము అన్నసంగతి భగవంతునికి తెలుసుకొన్నాక మనకు తెలుస్తుంది. కాని పరమస్థితి, చివరిస్థితి ఏమిటిఅంటే అద్వైతానుభవం, అద్వైత సుఖాన్ని పొందటమే. నిరాడంబరస్థితి, నిశ్చలస్థితి, నిర్మలస్థితి, నిరహంకారస్థితిని నువ్వు పొందగలిగితే జీవన్ముక్తస్థితి ఇప్పుడే ఇక్కడే నిన్ను వరిస్తుంది. దీనికోసం దేహం మరణించేవరకు ఆగనక్కరలేదు అని ఆచార్యులవారు చెప్పారు. కొంతమంది సహజంగా పుట్టుకతోనే మహాత్ములుగా పుడతారు. కొంతమంది మంచి పనులుచేసి మహాత్ములు అనిపించుకొంటారు. కొంతమంది మహాత్ములుగా పుట్టరు, ఈలోకంలో మంచిపనులు చేయరు. మమ్మల్ని మహాత్ములుగా గుర్తించమని సమాజాన్ని బాధపెడుతూ ఉంటారు. ఈ మూడోరకమైన మహాత్ములతో లోకం నిండి ఉంది అని షేక్సిఫియర్ చెప్పాడు.

నేను ఉన్నాను అని నాకు తెలుస్తోంది. ఆనేను ఎవరో నాకు తెలియదు. ఆనేను ఎవరో నాకు తెలియాలంటే నాకు వివేకం ఉండాలి, మంచితనం ఉండాలి, పూర్వపుణ్యం ఉండాలి. నాలో మంచితనం లేకపోతే, వివేకం లేకపోతే నేను ఎవడినో నేను తెలుసుకోవాలిఅనే బుద్ధి నాకు కలుగదు, ఆకోరిక రాదు. నీహృదయంలోఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి మూడు నియమాలు చెప్పారు. ఆహార నియమం, మాటల్లో నియమం, నిద్రలో నియమం. అన్ని నియమాలలో ఆహారనియమం ఉత్తమమైనది అని భగవాన్ చెప్పారు. పచ్చికూరలు తింటే నీదేహానికి ఆరోగ్యంవస్తుందికాని మోక్షం రాదు. నువ్వుతినే ఆహారం సాత్వికఆహారం అయి ఉండాలి. మితంగా తినాలి. నీవు తినే ఆహారం దేవుడు చూడడు. నీవుచేసే పనులు దేవుడు చూడడు. నీలో వ్యక్తిభావన ఉందాఅని భగవంతుడు చూస్తాడు. నీలో వ్యక్తిభావన లేకపోతే మోక్షంతో నిన్ను వరిస్తాడు. మాటలుయుక్తంగా ఉండాలి. నీవు మాట్లాడేమాట హితంగా ఉండాలి, మితంగా ఉండాలి. నీమాటలు నీకు సహకరించాలి, ఎదుటివారికి చల్లదనం కలుగజేయాలి. నాలుగుసార్లు ఆలోచించి ఒకమాట మాట్లాడాలి. నిద్రవిషయంలో జాగ్రత్తగా ఉండాలి. అతిగా నిద్రపోవటంవలన కాలం అంతా వృథా అవుతుంది. ఆహార నియమంవలన, మాటలలో నియమంవలన, నిద్రలో నియమంవలన మోక్షం రాదు. కానిఇవిఅన్నీ ఎందుకుఅంటే నీవుచేసే సాధనకు ఇవి సహకరిస్తాయి. వీటివలన మనస్సు, దేహం కంట్రోలులో ఉంటాయి. ఈ నియమాలు గమ్యంకాదు. నీవుఏదైనా నియమం పాటిస్తే దానివలన నీ మనస్సుకు, దేహానికి ఆరోగ్యం కలుగుతుంది. నీమనస్సు, శరీరం ఆరోగ్యంగా ఉంటే అవి నీసాధనకు ఉపయోగపడతాయి. సాధనవలన శిద్ధి కలుగుతుంది.

ఎప్పుడూ ఇలా ప్రయత్నాలు చేయాలి అని అనుకోవద్దు. ప్రయత్నంచేయగా, చేయగా ప్రయత్నంలేని స్థితికివెళ్ళిపోతావు. సత్వగుణాన్ని నెమ్మదిగా అభివృద్ధి చేసుకోండి. సజ్జన సాంగత్యంవలన నీహృదయంలో ఉన్న సత్యం నీకు తెలుస్తుంది. మాకు దేవుడిని తెలుసుకోవాలని ఉంది, మాకు దేవుడిని తెలుసుకోవాలని ఉంది అనేవారు చాలామంది ఉన్నారు. కాని దేవుడిని తెలుసుకోవాలనే ఆనేనును ప్రశ్నించేవాడు ఎవడూ లేడు. భగవాన్ చెప్పేది ఏమిటిఅంటే మీకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో ఆనేనును బోను ఎక్కించండి. ఆనేనును ప్రశ్నించండి. ఆనేనును విచారణ చేయండి. ఆనేను నిజం అని మీరు నమ్ముతున్నారు. కనీసం ఆనేనును సందేహించండి. ఆనేనును సందేహించటం ప్రారంభిస్తే దానిమూలంలోనికి అది వెళుతుంది. దానిమూలంలోనికి అది వెళ్ళినవెంటనే అది నశిస్తుంది. హృదయంలోఉన్న సహజస్థితి మీకు తెలిసేవరకూ కామక్రోధములు, భయం, అసూయ ఇవిఅన్నీ మిమ్మల్ని వెంటాడతాయి. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను ఉపయోగించుకొని మీహృదయంలోఉన్న సహజస్థితిని తెలుసుకోవటానికి ప్రయత్నంచేయండి.